తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 38
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
శనివారం, 19-08-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me



## చంద్రుడిపై లాండింగ్ కు పోటీపడుతున్న భారత్ రష్యా
## వెలుతురు ఆధారంగా
# ల్యాండింగ్

**న్యూఢిల్లీ ఆగష్టు 18 :**

చంద్రయాన్3, లూనా25 మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్నది. ఈ రెండింటిలో ఏది ముందు చంద్రుడిపై ల్యాండ్ అవుతుందనే అంశం సర్వత్రా ఆసక్తిగా మారింది. చంద్రయాన్3 ఆగస్టు 23న ల్యాండ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇస్రో ప్రకటించింది. అయితే రష్యా అంతరిక్ష కేంద్రం మాత్రం లూనా25 ల్యాండింగ్‌పై ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

**వెలుతురు ఆధారంగా ల్యాండింగ్**

చంద్రుడిపై ల్యాండింగ్‌కు వెలుతురు ఎంతో ముఖ్యం. చంద్రుడి ఉపరితలంపై ఆగస్టు 23న పగలు మొదలవుతుంది. ఇస్రో అదే రోజు ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ రష్యా మాత్రం ఆగస్టు 2123 మధ్య ఏ రోజు అనేది స్పష్టంగా చెప్పడం లేదు. వెలుతురును దృష్టిలో ఉంచుకొని చూస్తే రెండూ స్వల్ప సమయం తేడాతో ల్యాండ్ అయ్యే సూచనలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

**బరువే చంద్రయాన్‌కు ప్రతికూలం**

చంద్రయాన్3 సుమారు 40 రోజుల ప్రయాణం తర్వాత చంద్రుడిపై కాలు మోపనున్నది. కానీ లూనా25 మాత్రం 11 రోజుల వ్యవధిలోనే చంద్రుడ్ని చేరుకునే అవకాశం ఉన్నది. సామర్థ్యంలో ఉన్న తేడానే దీనికి కారణంగా తెలుస్తున్నది. తక్కువ బరువు, అధిక ఇంధన సామర్థ్యం ఉన్న కారణంగా లూనా25 వేగంగా చంద్రుడిని చేరుకుంటున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 3900 కిలోలు ఉండటం కూడా చంద్రయాన్3కి ప్రతికూలంగా మారింది. లూనా25 బరువు కేవలం 1750 కిలోలు. చంద్రుడిపైకి చేరుకున్న తర్వాత చంద్రయాన్3కి సంబంధించిన రోవర్ 14 రోజులు పరిశోధనలు జరపనుండగా, లూనా25 మాత్రం ఏడాది పాటు పని చేయనున్నది.

# తెలంగాణపై ఫోకస్

మరి కొద్ది నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తెలంగాణతోపాటు మధ్య ప్రదేశ్, చత్తీస్గఢ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాలపై బీజేపీ అధిష్టానం ఫోకస్ పెంచింది. ఈ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం. అభ్యర్థుల ఎంపికకు పరిగణనలోనికి తీసుకోవాలసిన అంశాలపై బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కీలక భేటిని నిర్వహించింది. ప్రధాని మోడీ, అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కమిటీ సమావేశ మైంది. ఈ సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో అనుసరించాల్సిన విధానాలపై ప్రధానంగా చర్చించారు. ఎన్నికలు జరగనున్న తెలంగాణతో పాటు మిగతా రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితిపై అగ్రనేతలు తీశారు. రాష్ట్రాల్లో పరిస్థితులపై వచ్చిన సమాచారం ఆధారం గా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఎన్నికలను బీజేపీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచార బాధ్యత లను ఎక్కువగా జాతీయ నాయకత్వమే తీసుకుని వ్యూహత్మకంగా ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



2 లో




2 లో

# రైతు కంట కన్నీరే

రాష్ట్రంలో వర్షా కాలం ప్రారంభం అయి మూడు నెలలు..
ఈ మూడు నెలల్లో రైతులకు కన్నీరే మిగిలింది..
వేసి విత్తనాలు అలాగే నాశనం అయిపోయాయి..
చాలా చోట్ల విత్తనాలే మొలకెత్తలేదు.

# టీ పీసీసీలో ఎస్సీ చిచ్చు రేపిన రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 18 :**

టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు పార్టీలో మరోసారి తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఇప్పటికే ఎస్సీల మద్దతు కోసం మందకృష్ణని గాంధీ భవన్ పిలిచి నాలుక కరుచుకున్నట్లయిందట. ఎస్సీల మద్దతేమో గాని గాంధీ భవన్ మీడియా హల్‌లో మందకృష్ణ కాంగ్రెస్ పై విమర్శలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. గతంలో ఎస్సి వర్గీకరణ చేస్తాంటే మద్దతు ఇచ్చామని, 10 ఏళ్ళు అధికారంలో ఉండి బిల్లు పెట్టకపోగా ఇప్పుడు 9 ఏళ్ళు ప్రతిపక్షంలో ఉండి అధికార పార్టీపై ఒత్తి చేయాలకపోగా మోసం చేశాయని మందకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. దీంతో మందకృష్ణని పిలిచి తిట్టించుకున్నట్లయిందని గాంధీ భవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మందకృష్ణ అక్కడితో ఆగకపోగా తాము వినతిపత్రం ఇస్తే ఎలాంటి హామీ ఇవ్వకపోగా అవమానపరిచే విధంగా రేవంత్ మాట్లాడారంటు మందకృష్ణ వ్యాఖ్యలు చేశారు.

ఇక ఇది మరువకముందే తమ ప్రభుత్వం వస్తే ఎస్టీ వర్గీకరణ చేస్తామంటూ రేవంత్ చేసినా వ్యాఖ్యలు సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తారు.. ఎస్టీ వర్గీకరణ ఎవరు అడిగారని ఎస్టీ వర్గీకరణ తేనే తుట్ట ని రేవంత్ కదిపారని మండిపడుతున్నారు. ఎస్టీలో దాదాపు 30 కి పైగా కులాలు ఉండగా మెజారిటీ లంబాడా తెగకి చెందిన వారు ఉన్నారు. రేవంత్ ఎస్టీ వర్గీకరణ చేస్తామని చెప్పడ్డం వల్ల లంబాడాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ వ్యాఖ్యల వల్ల లంబాడలు అధికంగా ఉండే 40 నియోజకవరర్గాల పై తీవ్ర ప్రభావం చూపుతుందని రేవంత్ వ్యాఖ్యలు లంబాడాలను కాంగ్రెస్ కి దూరం చేసే ప్రయత్నం అని మండిపడుతున్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అంశం దశబ్దాలుగా పెండింగ్‌లో ఉండగా అదే ఎటు తేల్చుకోలేక తలలు పట్టుకుంటుంటే.. మద్దతు కోసం అంటూ మందకృష్ణని గాంధీ భవన్‌కి పిలిచి డ్యామేజ్ చేసుకోగా.. ఇప్పుడు అసలు చర్చే లేని ఎస్టీ వర్గీకరణ అంశాన్ని తెర మీదకి తేవడంతో వివాదం ముదురుతుంది. కాంగ్రెస్ మెజారిటీ సీట్లు గెలిచే ఎస్సి, ఎస్టీ నియోజకవర్గల్లో రేవంత్ మాటలు ప్రతికులంగా మారే అవకాశం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఎస్టీ వర్గీకరణ కి సంబందించిన వ్యాఖ్యల పై ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే ని కలిసి పిర్యాదు చేయాలనీ తెలంగాణ కాంగ్రెస్ ఎస్టీ నేతలు ఆలోచిస్తున్నారట.



2 లో

# బ్లాక్ లిస్ట్ లో 52 లక్షల సిమ్ కార్డులు

మొబైల్ ఫోన్ వాడే చాలామందిలో కొత్త సిమ్ కార్డులు తీసుకునేందుకు మొగ్గు చూపుతుంటారు. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త సిమ్ కార్డుల జారీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. సిమ్‌కార్డులను విక్రయించే డీలర్లకు పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి అని పేర్కొంది. అయితే ఈ విషయాన్ని టెలికాం మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అయితే ఇప్పుడు కొత్తగా తీసుకుంటున్నటువంటి ఈ నిర్ణయం వల్ల నకిలీ సిమ్‌కార్డుల అమ్మకాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు.

# జనగామ సీటు కోసం.. ఇద్దరు ఎమ్మెల్సీల కన్ను

ఏకంగా ముత్తిరెడ్డి టికెట్ కు ఎసరు పెడుతూ...
వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవాలని చూస్తున్నారు

2 లో



# జనగామ సీటు కోసం.. ఇద్దరు ఎమ్మెల్సీల కన్ను

**జయభేరి, వరంగల్, ఆగస్టు 18 :**

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అధికార బీఆర్ఎస్ లో టికెట్ల పంచాయితీ షురూ అయిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఫిట్టింగ్ పెట్టేలా పలువురు పావులు కదుపుతుండటంతో... ఫైనల్ గా ఎవరు రేసులో ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇదే సీన్ జనగామ నియోజకవర్గంలో కనిపిస్తోంది.అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీఆర్ఎస్ లోని అంతర్గత కలహాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. అధినాయకత్వం సూచనలతో కాస్త వెనక్కి తగ్గినప్పటికీ... ఎన్నికలకు మరికొద్దిరోజులే టైం ఉండటంతో.... టికెట్ ఆశిస్తున్న నేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈసారి ఎలాగైనా అధినేత ఆశీసులు పొంది... అసెంబ్లీలో అడుగుపెట్టాలని చూస్తున్నారు. ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఫిట్టింగ్ పెట్టేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అవసరమైతే సొంత పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ... విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు. ఇదే పరిస్థితి చాలా చోట్ల ఉండగా... తాజాగా జనగామ టికెట్ పంచాయితీ తెరపైకి వచ్చింది. ఏకంగా టికెట్ ఆశిస్తున్న లీడర్ల పంచాయితీ అధినాయకత్వం వద్దకు చేరిపోయింది.ఫలితంగా.... టికెట్ ఎవరికి దక్కుతుంది..? రాని వారి పరిస్థితేంటి...? అన్న చర్చ నియోజకవర్గంలో గట్టిగా నడుస్తోంది.జనగామ... గతంలో ఉమ్మడి వరంగల్ నియోజకవర్గంలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గం. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జనగామను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. 2014, 2018 ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ పార్టీనే గెలిచింది. ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి విజయం సాధించారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముత్తిరెడ్డి పలుమార్లు వార్తల్లో నిలిచారు. భూకబ్జా ఆరోపణల విషయం పెద్ద వివాదంగా మారింది. ఓ దశలో జిల్లా కలెక్టరే ఆయనకు వ్యతిరేకంగా నివేదిక సమర్పించిన పరిస్థితులు కనిపించాయి. ఇదిలా ఉండగానే... కొంతకాలంగా మరోవైపు ముత్తిరెడ్డి కూతురు తుల్జా భవాని రెడ్డి తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుంది. స్వయంగా తన తండ్రి కబ్జా కోరు అంటూ బాహటంగా సంచలన వ్యాఖ్యలు చేసింది. కబ్జా చేసిన భూమిని తిరిగి అప్పగిస్తున్నట్లు కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోనే కాకుండా... రాష్ట్రవ్యాప్తంగా కూడా ముత్తిరెడ్డి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సరిగ్గా ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకునే పనిలో పడ్డారు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు. ఏకంగా ముత్తిరెడ్డి టికెట్ కు ఎసరు పెడుతూ... వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవాలని చూస్తున్నారు. దీంతో జనగామ బీఆర్ఎస్ రాజకీయం తారాస్థాయికి చేరినట్లు అయింది.ఈ సీటుపై ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి కన్నేశారు. తనకంటూ ఓ వర్గాన్ని నడిపిస్తున్నారు. పకడ్బందీగా ముత్తిరెడ్డి కి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. ఇటీవలే బయటికి వచ్చిన ఓ ఆడియో కాల్ కూడా కలకలం సృష్టించినట్లు అయింది. ఈసారి ముత్తిరెడ్డి టికెట్ ఇవ్వకుండా పల్లాకే టికెట్ ఇవ్వాలంటూ నియోజకవర్గానికి చెందిన కొందరు ముఖ్య నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలను గట్టిగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కొందరు నియోజకవర్గానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు... ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నాలు చేశారు. ఇదంతా కూడా పల్లా డైరెక్షన్ లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కూడా జనగామ సీటుపై కన్నేశారు. కేటీఆర్ కు అత్యంత సన్నిహితంగా ఉండే నేతల్లో ఒకరిగా ఉన్న శ్రీనివాస్ రెడ్డి.... ఈసారి హైకమాండ్ ను ఒప్పించి జనగామలో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఆయనవంతు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకొని... ముందుకు సాగే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిద్దరే కాకుండా... పలువురు బీసీ నేతలు కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఇక ముత్తిరెడ్డి కుమార్తె కూడా ఏదైనా ఒక పార్టీ నుంచి బరిలో ఉంటారని తెలుస్తోంది.మొత్తంగా జనగామలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగానే.... ఇద్దరు ఎమ్మెల్సీలు రేసులో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో రాజకీయం రసవత్తరంగా మారిపోయింది. ఇప్పటికే బీఆర్ఎస్ తొలి జాబితా సిద్ధమైపోయిందన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆ జాబితాలో జనగామ పేరు ఉంటుందా..? లేక చివర్లో అభ్యర్థిని ప్రకటిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక మరోసారి ముత్తిరెడ్డికే టికెట్ దక్కితే... మిగతా నేతలందరూ మద్దతుగా నిలుస్తారా లేదా అనేది కూడా చూడాలి..!




# ఆ అభ్యర్థులకు గ్రీన్ సిగ్నలా.. రెడ్ సిగ్నలా..

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 18 :**

తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఖరారు చేసిన కేబినెట్ గవర్నర్‌కు ఫైల్ పంపి చాలా కాలం అయింది. గవర్నర్ వారి నియామకానికి ఇంకా ఆమోదం తెలియచేయసేసదు. తెలంగాణ శాసనమండలిలో ఖాళీగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై చర్చించిన కేబినెట్.. బీసీ కోటా నుంచి హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ దాసోజు శ్రవణ్‌ను... ఎస్టీ సామాజిక వర్గం నుండి కుర్రా సత్యనారాయణను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ భేటీలో వీరిద్దరి పేర్లను నామినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత ఫైలును గవర్నర్ వద్దకు పంపారు. ఐతే.. గవర్నర్ ఇప్పటి వరకు ఆమోదం తెలుపుతూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన ఇద్దరు నేతలతో పాటుగా అధికార పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.గతంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పాడి కౌశిక్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేయగా తమిళిసై ఆమోదం తెలుపలేదు. కౌశిక్ రెడ్డిపై కేసులు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో గవర్నర్ పెండింగ్‌లో ఉంచారు. దీంతో రాజ్‌భవన్‌కు.. రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం తలెత్తింది. చివరికి కేసీఆర్ సర్కార్... కౌశిక్ రెడ్డిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా చేయాలనే ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నారు. తర్వాత ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని చేసి గవర్నర్ కోటాలో మధుసూదనాచారికి అవకాశం కల్పించారు. అప్పటి నుండి గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం ఇంకా కొనసాగుతోంది.గతంలో వరద ముంపు ప్రాంతాలను సందర్శించడానికి వెళ్లినప్పుడు అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బడ్జెట్‌ను గవర్నర్ ఆమోదించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం హై కోర్టును ఆశ్రయించింది. తాజాగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ పంపిన బిల్లు డ్రాఫ్ట్‌ను ఆమోదించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య హైడ్రామా చేటు చేసుకుంది. మొత్తానికి సందర్భం వచ్చినప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై గవర్నర్ విమర్శలు చేయడం.. అదే విధంగా గవర్నర్‌ను అడ్డుపెట్టుకుని కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని రాష్ట్ర ప్రభుత్వం విమర్శలు చేయడం కామన్‌గా మారింది. ఈ తరుణంలో అసెంబ్లీ ఎన్నికల ముందు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను నామినేట్ చేసే విషయంలో తమిళి సై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయాలంటే.. వివిధ రంగాల్లో పేరు ప్రతిష్టలు పొందిన వారిని , మేధావులను సిఫారసు చేయాలనే సంప్రదాయం ఉంది. పాడి కౌశిక్ రెడ్డిపై కేసులున్నాయన్న కారణంగా గవర్నర్ తిరస్కరించారు. దాసోజు శ్రవణ్ రాజకీయ నేతగానే అందరికీ పరిచయం. అలాగే కుర్రా సత్యనారాయణ కూడా మాజీ ఎమ్మెల్యే. ఈ కారణాలతో వారి పేర్లను గవర్నర్ ఆమోదించడం లేదని చెబుతున్నారు. నిజానికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవి కాలం ఎప్పుడో పూర్తయింది. కొంత కాలం ఎవర్నీ నియమించకుండా కేసీఆర్ ఆలస్యం చేస్తే..ఇప్పుడు గవర్నర్ పెండింగ్ లో పెట్టారు.

# తెలంగాణపై ఫోకస్

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 18 :**

మరి కొద్ది నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాలపై బీజేపీ అధిష్టానం ఫోకస్ పెంచింది. ఈ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం. అభ్యర్థుల ఎంపికకు పరిగణనలోనికి తీసుకోవాలసిన అంశాలపై బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కీలక భేటిని నిర్వహించింది. ప్రధాని మోడీ, అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కమిటీ సమావేశ మైంది. ఈ సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో అనుసరించాల్సిన విధానాలపై ప్రధానంగా చర్చించారు. ఎన్నికలు జరగనున్న తెలంగాణతో పాటు మిగతా రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితిపై అగ్రనేతలు తీశారు. రాష్ట్రాల్లో పరిస్థితులపై వచ్చిన సమాచారం ఆధారం గా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఎన్నికలను బీజేపీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచార బాధ్యతలను ఎక్కువగా జాతీయ నాయకత్వమే తీసుకుని వ్యూహాత్మకంగా ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒక్క మధ్యప్రదేశ్ వినహా మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో.. ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు అనుసరించాల్సిన వ్యహంపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. మధ్యప్రదేశ్ లో అధికారం నిలుపుకోవడంతోపాటు గతంలో అధికారంలో



ఉన్న చత్తీస్ గఢ్, రాజస్థాన్ లో ఈసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గడ్ లలో హోరాహోరీగా ప్రత్యర్థి పార్టీలతో తలపడాల్సి రావొచ్చని సమావేశంలో నేతలు అన్నట్లు సమాచారం. ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరిగినట్లు తెలిసింది. ఎన్నికల బరిలో దింపాల్సిన అభ్యర్థులను ముందే గుర్తించి ప్రకటిస్తే తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం తోపాటు వ్యూహాత్మకంగా వ్యవహరించడానికి తగినంత సమయం ఉంటుందని అన్నట్టు సమాచారం.సమయం దొరుకుతుం దని సమావేశం అభిప్రా య పడితే ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన తర్వాత బీజేపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని కమిటీ నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ పరిస్థితిపై కమిటీ ఆరా తీసినట్లు తెలిసింది. తెలంగాణ లో పాతుకుపోయిన బీఆర్ ఎస్.. జోష్ తెచ్చుకుని..పరుగులు పెడుతున్న కాంగ్రెస్.. ల నడుమ.. బీజేపీ ..అధికార పీఠం ఎక్కుతోందా.. ప్రత్యర్థులను ఢీ కొట్టే దమ్ము ఉందా..?


**కాలమే సమాధానం చెబుతోంది**

న్నికలు జరగనున్న రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో అభ్యర్థులను ముందుగానే రిలీజ్ చేయాలని ప్రధాని మోదీ ఆదేశించినట్టుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. రెండు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించక ముందే బీజేపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసి అందరినీ ఆశ్యర్యంలో ముంచెత్తింది. గతంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థుల జాబితాలను ప్రకటించేవారు. ఈ సారి ముందుగానే కార్యాచరణలోకి వచచేశారు. బీజేపీ తన తొలి జాబితాలో ఛత్తీస్‌గఢ్‌కు 21 మంది అభ్యర్థులను ప్రకటించగా.. ఇందులో ఐదుగురు మహిళలున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి ఐదుగురు మహిళలు సహా 39 మంది అభ్యర్థులను కూడా బీజేపీ తన తొలి జబితాని ప్రకటించింది.వచ్చే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి కీలకం. పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో పార్టీ ఎన్నికల సన్నాహాలను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమీక్షించిన తర్వాత ఈఅభ్యర్థుల ప్రకటన వెలువడింది. ప్రకటన వెలువడింది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు. పార్టీ ముఖ్య నేతలు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికలకు గ్రౌండ్ వర్క్ చేయడానికి పార్టీకి తగినంత సమయం ఉండేలా, అభ్యర్థుల మొదటి జాబితాను త్వరగా ప్రకటించాలని ప్రధాని మోడీ బీజేపీ అగ్ర నాయకులను సూచించడంతో అభ్యర్థుల్ని ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. 230 మంది సభ్యుల మధ్యప్రదేశ్ అసెంబ్లీకి, 90 మంది సభ్యుల ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చేనెలలో ఎన్నికలు జరగనున్నాయి.రాజస్థాన్‌లలోనూ అభ్యర్థుల ఎంపికపై బీజేపీ ఎన్నికల కమిటీ సమీక్షించినప్పటికీ ఆయా రాష్ట్రాల్లో తొలి జాబితా విడుదలకు మరికొంత సమయం తీసుకోవాలని అనుకున్నారు. తెలంగాణలో తొలి జాబితా ఇప్పటికే సిద్ధమయింది. అయితే.. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీకూడా అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశం ఉండటంతో.. ఎదురు చూడాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఇతర పార్టీల నుంచి బలమైన నేతలు వస్తే చేర్చుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు.

# రైతు కంట కన్నీరే


**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 18 :**

రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం అయి మూడు నెలలు గడుస్తోంది. ఈ మూడు నెలల్లో రైతులకు కన్నీరే మిగిలింది. జూన్ లో లోటు వర్షపాతం నమోదు కాగా.. వేసి విత్తనాలు అలాగే నాశనం అయిపోయాయి. చాలా చోట్ల విత్తనాలే మొలకెత్తలేదు. మొలకెత్తిన కాస్తో, కూస్తో పంటలను.. ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలు నాశనం చేశాయి. అనేక రకాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మళ్లీ వరుణుడు కరుణ చూపించకపోవడంతో... మళ్లీ జూన్ నెల నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆగస్టులో సాధారణ వర్షపాతం 217.4 మిల్లీ మీటర్లు. ఈనెల 15వ తేదీ వరకు 108.4 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా.. 19.9 మిల్లీ మీటర్లే నమోదు అయింది. అంటే దాదాపు 82 శాతం లోటు ఉంది. ఈనెల ప్రారంభం నుంచి 23 జిల్లాల్లో అప్పుడప్పుడూ వర్షాలు కురవగా... మిగిలిన జిల్లాల్లో వరుణుడి జాడే కనిపించలేదు. ముఖ్యంగా నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్ కర్నూల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, యాదాద్రి జిల్లాలోని 28 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు అయింది. పత్తి, మిర్చి, మొక్కజొన్న, కందులు, వేరుశనగ వంటి పంటలకు, వరి పొలాలకు నీరు అందించాలి. ప్రస్తుతం ఆశించిన వర్షాలు లేకపోవడంతో రైతులు బోర్లు, బావులు, చెరువులపై ఆధార పడుతున్నారు. ని



జామాబాద్, కామారెడ్డి, నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట జిల్లాల్లో వరి పొలాలకు బోర్లు, బావుల నుంచి నీటిని పారిస్తున్నారు. జోగులాంబ గద్వాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం, మంచిర్యాల, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లోని వర్షాధార పంటలకు నీటి వసతి లేక ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 466.9 మిల్లీ మీటర్లు. ఇప్పటి వరకు 582.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అంటే సాధారణ వర్షపాతాన్ని దాటినా.. అత్యధిక శాతం ఒక్క జులైలోనే కురవడంతో.. పంటల సాగుకు అనేక సమస్యలు వస్తున్నాయి. ఏం చేయాలో పాలుపోని రైతన్నలు కన్నీరు పెడుతున్నారు ఈ ఏడాది పంట నష్టం మీద పడినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ లో సాధారణంగా 129.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. కేవలం 72.6 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. అలాగే జులైలో 229.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అవ్వాల్సి ఉండగా... అత్యధికంగా 489.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆగస్టు 15వ తేదీ వరకు 108.4 వర్షం కురవాల్సి ఉండగా.. 19.9 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది.

# బ్లాక్ లిస్ట్ లో 52 లక్షల సిమ్ కార్డులు




**జయభేరి, న్యూఢిల్లీ,ఆగస్టు 18 :**

మొబైల్ ఫోన్ వాడే చాలామందిలో కొత్త సిమ్ కార్డులు తీసుకునేందుకు మొగ్గు చూపుతుంటారు. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త సిమ్ కార్డుల జారీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. సిమ్‌కార్డులను విక్రయించే డీలర్లకు పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి అని పేర్కొంది. అయితే ఈ విషయాన్ని టెలికాం మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అయితే ఇప్పుడు కొత్తగా తీసుకుంటున్నటువంటి ఈ నిర్ణయం వల్ల నకిలీ సిమ్‌కార్డుల అమ్మకాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఒకే వ్యక్తిపై ఎక్కువ సిమ్‌ల విక్రయాలకు కూడా అడ్డుకట్టపడుతుందని తెలిపారు. మరీ ముఖ్యంగా సిమ్ స్పామింగ్‌ను కూడా తగ్గిస్తుందని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు 52 లక్షల మొబైల్ కనెక్షన్లు మూసివేశామని కేంద్రం తెలిపింది. అలాగే దాదాపు 67 మంది డీలర్లను కూడా బ్లాక్ లిస్టులో పెట్టినట్లు వెల్లడించింది. అయితే ఈ ఏడాది మే నుంచి సిమ్‌కార్డు డీలర్లపై దాదాపు 300 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.నకిలీ సిమ్‌కార్డుల రాకెట్‌లో ఉన్నటువంటి దాదాపు 66 వేల వాట్సాప్ అకౌంట్లు బ్లాక్ అయ్యాయి. అయితే ఇప్పుడు తాజాగా జారీ చేసినటువంటి మార్గదర్శకాల ప్రకారం చూసుకుంటే.. ఒకవేళ పోలీస్ వెరిఫికేషన్ లేకుండా సిమ్‌కార్డులు విక్రయిస్తే దాదాపు 10 లక్షల రూపాయల వరకు జరిమానా విధించనున్నారు. అయితే ప్రస్తుతం దేశంలో 10 లక్షల మంది వరకు సిమ్‌కార్డు డీలర్లు ఉన్నారు. దీంతో ఇప్పుడు వీళ్లందరూ కూడా తప్పకుండా పోలీస్ వెరిఫికెషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.

అలాగే మరో ముఖ్య విషయం ఏంటంటే షాప్ కోసం కేవైసీని సైతం చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం దేశంలో ఎక్కడో ఓ చోట.. ఏదో ఒక ప్రాంతంలో సిమ్‌కార్డు మోసాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు తాజాగా ఆధార్ నంబర్‌ను సైతం దుర్వినియోగం చేస్తున్నటువంటి ఘటన వెలగులోకి రావడం చర్చనీయాంశమైంది. ఒకే ఆధార్‌కార్డుపై దాదాపు 658 వరకు సిమ్‌కార్డులను జారీ చేయగా.. అందులోని సిమ్‌కార్డులన్నీ కూడా ప్రస్తుతం వినియోగంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

తమిళనాడులోని సైబర్ క్రైమ్ వింగ్ ఈ వారంలో ఓ వ్యక్తి ఆధార్ నంబర్‌పై ఉన్నటువంటి దాదాపు 100 నుంచి 150 వరకు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకుంది. ఇదిలాఉండగా గత నాలుగు నెలల్లో తమిళనాడులోని సైబర్ క్రైమ్ వింగ్ రాష్ట్రవ్యాప్తంగా 25,135 సిమ్ కార్డులను మోసపూరిత కార్యక్రలపాలకు వినియోగిస్తున్నట్లు అనుమానించింది. దీంతో వాటన్నింటిని బ్లాక్ చేసింది. ఇక ఏపీ విషయానికి వస్తే విజయవాడలోని ఒకే ఫోటోతో 658 సిమ్‌కార్డులు జారీ చేసినట్లు ఏఐ టెక్నాలజితో విషయం బయటపడింది. ఒకే ఫోటోతో ఓ టెలికాం సంస్థకు చెందినటువంటి 658 సిమ్‌లను ఓ యువకుడు పొందినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. దీంతో ఇందుకు సంబంధించి ఆయా సిమ్‌లన్నింటిని బ్లాక్ చేయాలని టెలికాం కంపెనీని పోలీసులు ఆదేశించారు.



# పార్టీలోకి జగ్గారెడ్డి వద్దు

**జయభేరి, మెదక్, ఆగస్టు 18 :**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ , సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పార్టీ మార్పుపై మరోమారు చర్చ జరుగుతుంది. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డితో, జగ్గారెడ్డికి ఉన్న విబేధాలతో గత కొన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు జగ్గారెడ్డి. అయితే కొన్ని రోజులుగా జగ్గరెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. తాజాగా మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జగ్గారెడ్డి, కేటీఆర్‌ని కలవడంతో ఆయన బీఆర్ఎస్‌లో చేరడం పక్కా అని జోరుగా ప్రచారం జరుగుతోంది. జగ్గారెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తాడు అని జరుగుతున్న ప్రచారాలతో సంగారెడ్డి బీఆర్ఎస్ నేతలు అలెర్ట్ అయ్యారు. ఎట్టి పరిస్థితిలో జగ్గరెడ్డిని బీఆర్ఎస్ లోకి రానివ్వద్దని కార్యకర్తలు, నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. రెండు రోజులుగా బీఆర్ఎస్‌లోకి జగ్గారెడ్డి చేరడం పక్కా అని వస్తున్న వార్తలతో మరోసారి అలెర్ట్ అయ్యారు సంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నేతలు. నిన్న సుమారు 200 మంది నేతలు, కార్యకర్తలు కలిసి హైదరాబాద్‌లో ఉన్న జిల్లా మంత్రి హరీష్ రావు వద్దకు వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో చింత ప్రభాకర్‌కే టికెట్ ఇవ్వాలని, పోయిన ఎన్నికల్లో కూడా అతి తక్కువ మెజార్టీతో చింత ప్రాభకర్ ఓడిపోయారని గుర్తు చేశారు. వీరి మాటలు విన్న మంత్రి హరీష్ రావు కూడా సానుకూలంగానే స్పందించారని సమాచారం. ఈ విషయాన్ని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానంటూ సంగారెడ్డి బీఆర్ఎస్ నేతలకు హామీ కూడా ఇచ్చారని సమాచారం. మరోవైపు బీఆర్ఎస్‌లోకి జగ్గరెడ్డి రాకను సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు అందరూ వ్యతిరేకిస్తున్నారు. జగ్గారెడ్డి నియోజకవర్గ పరిధిలో అందుబాటులో ఉండడని, తాను ఎమ్మెల్యేగా ఉనప్పుడు కూడా నియోజకవర్గానికి చేసింది కూడా ఏమి లేదని అంటున్నారు బీఆర్ఎస్ నేతలు. నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం ఉన్నా కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండడని అంటున్నారు. అంత పెద్ద కరోనా వచ్చి నియోజకవర్గ ఎంతోమంది ఇబ్బందులు పడ్డా కూడా ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి అందుబాటులో లేకపోవడం ఒక్కటి చాలు నిదర్శనంగా చెప్పుకోవడానికి అని అంటున్నారు. ఎమ్మెల్యే పదవి ఉన్నా లేకున్నా చింత ప్రభకర్ నియోజకవర్గ ప్రజలకు, నేతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నాడని, ఆయనకే మళ్ళీ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒక వేళ తమ పార్టీలోనే ఇంకా ఎవరైనా టికెట్ కావాలని అడిగితే, వాళ్ళ కాళ్ళు మొక్కి అయినా సరే వారిని బుజ్జగించి.. చింత ప్రభకర్ కే టికెట్ వచ్చేలా చేసుకుంటాం అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న జగ్గరెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై మర్యాద లేకుండా ఇష్టం వచ్చినట్లు మట్లాడాడని, అలాంటి వ్యక్తిని బీఆర్ఎస్ లోకి ఎలా తీసుకుంటారని ప్రశిస్తున్నారు సంగారెడ్డి బీఆర్ఎస్ నేతలు. జగ్గారెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం భారీగా జరుగుతున్నా.. దానిపై జగ్గారెడ్డి స్పందించకపోవడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. చూడాలి మరి సంగారెడ్డి బీఆర్ఎస్ నేతల పంతం నెగ్గుతుందా? లేక జగ్గారెడ్డిని పార్టీలోకి చేర్చుకుని, అధిష్టానం స్థానిక నేతలను కూల్ చేస్తుందా? ఎక్కడి వరకు వెళ్తుందో ఈ మ్యాటర్ అనేది సంగారెడ్డిలో ఇంట్రస్టింగ్‌గా మారింది.

# జిల్లెలగూడ లో పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సబితా

**జయభేరి, మీర్పేట్ :**

బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతి ఉత్సవాలు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలోని చందనా చెరువు కట్టపై నిర్వహించారు. ఈ ఉత్సవాలు జిల్లెలగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ విద్యాశాఖామాత్యులు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కట్టపై ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మీర్పేట్ మున్సిపాలిటీ మేయర్ శ్రీమతి దుర్గ, డిప్యూటీ మేయర్ ట్. విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు నవీన్ గౌడ్, భూపేష్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు జంగయ్య గౌడ్, మీర్పేట్ మాజి సర్పంచ్ పల్లె పాండు గౌడ్, ఇతర కర్పొరేటర్లు, 'గోపా' రాష్ట్ర కోశాధికారి ఎం. రఘునాథ్ గౌడ్, జిల్లెలగూడ, మీర్పేట్ గౌడ సంఘం నాయకులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గోపా' ప్రచురించిన పాపన్న గౌడ్ జీవిత సంక్షిప్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ... పాపన్న గౌడ్ కేవలం గౌడలకే కాదు, అణగారిన వర్గాల వారందరికి స్ఫూర్తి నింపిన నాయకుడని, ఆయన ఆదర్శాలు నేడు మనందరికీ అవసరమని అన్నారు. మన సిఎం కెసిఆర్ గౌడ భవనానికి 5 ఎకరాలు భూమి, 5 కోట్లు ఇచ్చి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని, అలాగే వనాలు పెంచుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. అయితే ఆ చెట్లను కాపాడు కోవాల్సిన బాధ్యత మీదేనని గౌడ సంఘం నాయకులని కోరారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మీర్పేట్ మున్సిపాలిటీలో గౌడ సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలని మంత్రి గారిని కోరారు. మంత్రి ఈ విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, ఇతర గౌడ సంఘం మరియు తెరాస నాయకులు ప్రసంగించారు. పాపన్న గౌడ్ జయంతి, విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలోని గౌడులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేసారు.





# పరాక్రమానికి మారు పేరు బోస్

1943లోనే స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ధీశాలి సుభాష్ చంద్రబోస్. స్వతంత్ర భారత సైన్యాన్ని కూడా ఆయన తయారు చేశారు. దేశ విదేశాల మద్దతు కూడగట్టి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషి చేసిన పరాక్రమవంతుడు బోస్. ఆంగ్లేయుల కళ్ళు కప్పి, ఎన్నో మారు వేషాలు వేసుకుని దేశానికి మద్దతును కూడగట్టారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డ బోస్. ఆయన ధైర్య సాహసాలు అనితర సాధ్యమైనవి. ప్రజలచే నేతాజీగా కీర్తించబడ్డారు. ఆయన త్యాగం నేటి యువతకు ఆదర్శం. సమసమాజం కోసం ఆయన కలలు కన్నారు. ఆయన ఆశయాల కోసం పనిచేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. బోస్ 78 వవర్ధంతి సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డి. సురేష్, ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, న్యాయవాది టి. భాస్కర రావు, నర్రాసాంబు, దాసరి లక్ష్మీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న కు నివాళి

**జయభేరి, ఉప్పల్ :**

చిలుక నగర్ డివిజన్లోని నోవా బ్యాంక్విట్ హాల్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్. తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు.. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాంను ఎదురించిన ధీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా భరతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీకి సమకాలికుడు బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు అభ్యుదయ సమసమాజ స్థాపకుడు, బహుజన రాజ్యాధికార ప్రతీక, బహుజన విప్లవ వీరుడు, బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అందరికీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, పండ్ల కిషన్, రామానుజన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, జిల్లాల ప్రవీణ్, శ్యామ్ బాలు, మల్లేశ్ గౌడ్, విష్ణు గౌడ్, పెద్దయ్య గౌడ్, రాజు గౌడ్, మోగులయ్య గౌడ్, సురేష్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సిసి రోడ్ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

**జయభేరి, ఉప్పల్ :**

చిలకనగర్ డివిజన్ సాయిరాం నగర్ కాలనీలో 14 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల మాట్లాడుతూ... చిల్కానగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఇప్పటికే దాదాపు 60 కోట్లతో అభివృద్ధి పనులను చేస్తున్నామని అన్నారు. మేయర్, ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని నిధులు తీసుకువస్తామని అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నూతన సీసీ రోడ్లు వేయిస్తున్నందుకు సాయిరాం కాలనీ ప్రజలు కార్పొరేటర్ గీత ప్రవీణ్ ని అభినందిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్కుమార్, సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామానుజం, జిలల ప్రవీణ్, శ్యామ్, బాలు మొదలగురు పాల్గొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**

మీర్ పేట్ HB కాలనీ డివిజన్ లోని, ఈసీఐఎల్ X రోడ్, చిలుక నగర్ లో సర్దార్ సర్వాయి పాపన్న చౌరస్తా వద్ద తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు.. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించిన BLR చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, BRS రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజాంను ఎదురించిన ధీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా భరతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీకి సమకాలికుడు బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు అభ్యుదయ సమసమాజ స్థాపకుడు, బహుజన రాజ్యాధికార ప్రతీక, బహుజన విప్లవ వీరుడు, బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్దార సర్వాయి పాపన్న గౌడ్ అందరికీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో BLR చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, విష్ణు గౌడ్, పెద్దయ్య గౌడ్, రాజు గౌడ్, మోగులయ్య గౌడ్, సురేష్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళి

**జయభేరి, మేడ్చల్ :**

శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 వ జయంతి సందర్భంగా కీసర మండల కరీంగుడ గ్రామంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హరివర్ధన్ రెడ్డి తో పాటు గ్రామ సర్పంచ్ కౌకుంట్ల గోపాల్ రెడ్డి, ఎంపిటిసి మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ కన్వీనర్ శ్రీశైలం, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, గౌడ సంగం అధ్యక్షుడు దేశం రవీందర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇందిరాల నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు దేశం పరమేష్ గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ కౌకుంట్ల అంజిరెడ్డి, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు విగ్నేష్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ సమ్మి, కీసర గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపల్లి రవీందర్, కీసర మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామిడి విజయ్ రెడ్డి, నల్ల మధుసూదన్ రెడ్డి, దయానంద్ గౌడ్, అశోక్, గౌడ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దిన దిన అభివృద్ధి చెంది మంచి లాభాలు అర్జించాలి

**జయభేరి, ఘట్ కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ రోడ్డు రాజ్ మార్ట్ పక్కన ఆనంద్ కలెక్షన్ బట్టల షాప్ ను తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ వస్త్ర దుకాణం దిన దిన అభివృద్ధి చెంది మంచి లాభాలు అర్జించాలని వినియోగదారులకు నాణ్యమైన, తక్కువ ధరకు వస్త్రాలను అందించి వారి మన్నాలను పొందాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వస్త్ర దుకాణాల యజమానులైన అబ్బ గోని మీనా ఆనంద్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, కౌన్సిలర్లు కొమ్మ గోని రమాదేవి మహిపాల్ గౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవ రెడ్డి, బేతాళ నర్సింగ్ రావు, బండారి ఆంజనేయులు గౌడ్, కో ఆప్షన్ సభ్యులు షౌకత్ మియా, మెరుగు నరేష్ గౌడ్, పల్లె విజయ్ గౌడ్, నందగోపాల్ గౌడ్, వీరేష్ గుప్తా, నజీర్, బిజిలి సదానంద్, మాజీ వార్డ్ సభ్యురాలు దేవరకొండ పద్మ రాజా చారి, మహిళా నాయకురాలు శ్రావణి రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన నిర్మానాలకు నలువైపులా గ్రీన్ మ్యాట్



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఇస్లావత్ నమ్య ఆధ్వర్యంలో సానిటేషన్, రెవిన్యూ, టౌన్ ప్లానింగ్, అకౌంట్స్ & ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాన్ని స్వచ్ఛ పీర్జాదిగూడ గా నిర్మించాలనే లక్ష్యంతో ప్రజలు తడిచెత్త, పొడిచెత్త, హానికారక చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందిస్తున్నారని... కొంతమంది రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాలు, రోడ్డు, వీధి చివర్లలో చెత్త వేస్తున్నారని అట్టి ప్రాంతాలను గుర్తించి అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై చెత్త వేయడం ద్వారా కలిగే అనర్థాల గురించి సామాజిక మధ్యమాలు, స్వచ్ఛ ఆటోలతో అనౌన్స్మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు .బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, ఖాళీ ప్రదేశాలు, నాలాలు, కాలువలు, మార్కెట్ ప్రదేశాలు తదితర ప్రాంతాలలో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించుటకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామని రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి డివిజన్ ప్రజలకు అందుబాటులో "స్వచ్ఛ వాహనాలను"ఏర్పాటు చేసామని, ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆస్తిపన్నుతో పాటు ట్రేడ్లైసెన్సుల ఫీజులు కూడా వసూలు చేయడం, ట్రేడ్ లైసెన్సు లేని వ్యాపారుల లైసెన్సులు జారీచేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పరిదిలో ఉత్పత్తి అయ్యే గృహ నిర్మాణం (C&D waste) వ్యర్థలను నిల్వ చేయుటకు పలు డివిజన్లలో ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి అక్కడ నిల్వచేయవలసిందిగా అలాగే నూతన నిర్మానాలకు నలువైపులా తప్పనిసరిగా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయవలసిందిగా సూచించడం జరిగింది. నగర పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డుల (Advertising Boards, హోర్డింగ్స్) వివరాలు సేకరించి నిబంధనలకు లోబడి ఉన్న వాటికి తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయవలసిందిగా, అనుమతి లేని వాటిని తొలగించవలసిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో RO శ్రీనివాస్ రెడ్డి, ACP శ్రీనివాస్, AE బిక్ష పతి, మేనేజర్ జ్యోతి రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, రెవిన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.





# నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది

**జయభేరి, మేడిపల్లి :**

పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసాను కల్పిస్తున్నదని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆపద సమయాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు అండగా నిలుస్తున్నదని స్పష్టం చేసారు. మున్సిపల్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన నాగలక్ష్మి రూ.37,500/, లలిత రూ.35,000/, రాజ్యలక్ష్మి రూ.65000/, దివ్య రూ.45000/, జ్యోతి రూ.22500/ విలువగల చెక్కులను లబ్దిదారులకు మేయర్, నాయకులు ఈశ్వర్ రెడ్డి, బండారి రవీందర్ లతో కలిసి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపిస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని స్పష్టం చేసారు.





**నాగారం లో జరిగిన కేక్ టౌన్ బేకరి ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన BLR చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, BRS రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ చెంద్రారెడ్డి, BLR చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మహేశ్ గౌడ్, రాజేష్, బేకరి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.**



**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన "క్రాంతి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్" నూతన కార్యాలయాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి, అమర్ సింగ్, భీం రెడ్డినవీన్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ పబ్బ బాలయ్య, వైస్ చైర్మన్ రాజేశ్వర్ రావు, డైరెక్టర్స్ యాదయ్య,మురళి కృష్ణ, శ్రీనివాస్ రాజు,శైలజ,అసవ, నాగేశ్వర్ రావు, COO సీత రాములు, CEO సోమ శేఖర్,బ్రాంచ్ హెడ్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.**

# కామినేని హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత

**జయభేరి, రాచకొండ :**

ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. గుండె చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన ఒక మహిళ మృతి చెందింది. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం బానాల గ్రామానికి చెందిన అలివేలు అనే మహిళకు గుండె సమస్య ఏర్పడింది. ఆరోగ్య శ్రీ కింద చికిత్స కోసం ఈ నెల 9న అలివేలును కామినేని ఆస్పత్రి వైద్యులు చేర్చుకున్నారు. ఆరోగ్య శ్రీ మంజూరు అయిందని చెప్పి చికిత్స ప్రారంభించారు. ఆరోగ్యం విషమంగా మారడంతో గురువారం సాయంత్రం మహిళ మృతి చెందింది. అయితే లక్ష రూపాయలు కట్టకపోతే శవం ఇచ్చేది లేదని ఆస్పత్రి యాజమాన్యం చెప్పింది. గత రాత్రి నుంచి ఆస్పత్రి వద్ద మృతురాలి కుటుంబ సభ్యుల పడిగాపులు కాసారు. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**జయభేరి, హైదరాబాద్ :**

మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ ప్రమాదం జరిగింది. ఒక ఆర్టీసీ బస్సు బైక్ ను డీ కొట్టింది. రహమత్ నగర్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. బోరబండ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న క్రమంలో బస్సు ద్విచక్ర వాహనదారుని ఢీకొనడంతో మృతి చెందాడు. డ్రైవర్, కండక్టర్ లు బస్సు నుండి పరార్ అయ్యారు.

## దానికి ఓకే అంటే ఛాన్స్ ఇస్తా..



చెన్నై సొగసరి రెజీనా కసాండ్రాకు తెలుగులోనూ మంచి పాపులారిటే ఉంది. కొత్త జంట, పవర్, పిల్లా నువ్వులేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ ఇలా ఒక దశలో బ్యాక్ టు బ్యాక్ హిట్లు కొట్టింది. ఈ మధ్య కాలంలో తెలుగులో అడప దడపాగా సినిమాలు చేస్తుంది కానీ.. తమిళంలో మాత్రం వరుస ప్రాజెక్టతో తీరిక లేకుండా గడుపుతుంది. ఈ బ్యూటీ సైతం క్యాస్టింగ్ కౌచ్కు గురయ్యానని పేర్కొంది. ఇండస్ట్రీకి వచ్చిన మొదట్లో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఓ వ్యక్తి కాల్ చేసి అడ్జెస్ట్మెంట్కు ఓకే అంటే ఛాన్స్ ఇస్తా. ఆ వెంటనే షూటింగ్ కూడా మొదలుపెడదాం అని అన్నట్లు రెజీనా చెప్పింది. అయితే అప్పుడు తనకు అడ్జెస్ట్మెంట్ అంటే ఎంటో తెలీదని, తన మేనేజర్ను అడిగితే అసలు విషయం చెప్పాడని వెల్లడించింది. ఇది జరిగి పది సంవత్సరాలైందని, ప్రస్తుతం రెజీనా ఓ వైపు సినిమాలు, మరోవైపు వెబ్ సిరీస్లతో బిజీ బిజీగా గడుపుతుంది. ఈ బ్యూటీ నటించిన శాకినీ డాకినీ సినిమా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. అయితే ఈ సినిమా ప్రమోషన్లలో మ్యాగీ అంటూ ఈ అమ్మడు చేసిన కామెంట్స్ .



## ఆదికేశవ
### నవంబర్ 10న విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి ప్రేక్షకులు మెచ్చే వైవిధ్య భరిత చిత్రాలను అందిస్తోంది. వారు ఓ యాక్షన్ చిత్రం కోసం పంజా వైష్ణవ్ తేజ్తో చేతులు కలిపారు. యువ నటుడు వైష్ణవ్ తేజ్ విభిన్న తరహా చిత్రాలతో తెలుగు చిత్రసీమలో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. మొదటి సినిమా 'ఉప్పెన'తోనే సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'ఆదికేశవ' అనే భారీ యాక్షన్ ఎంటర్టైనర్తో రాబోతున్నారు.ఈ చిత్రానికి శ్రీకాంత్ ఎన్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో మాస్ మూవీ ప్రియులను, యాక్షన్ ప్రియులను ఆకట్టుకోవాలని ఈ నూతన దర్శకుడు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్, పంజా వైష్ణవ్ తేజ్ను మునుపెన్నడూ లేని విధంగా కొత్త అవతార్లో చూపించి మెప్పించింది. ఆదికేశవలో యువ సంచలనం శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. ఆమె చిత్ర అనే పాత్రలో సందడి చేయనున్నారు. శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ లో ఆమె అందం, పాత్రలోని చిలిపితనం ఆకట్టుకున్నాయి. శ్రీలీలతో పాటు జాతీయ అవార్డు గ్రహీత, మలయాళ నటుడు జోజు జార్జ్, అపర్ణా దాస్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీని ఆగస్ట్ 18 నుంచి నవంబర్ 10కి వాయిదా వేస్తున్నట్లు ఆదికేశవ చిత్ర బృందం ప్రకటించింది. ఇటీవలే ఆదికేశవ చిత్రీకరణ ప్యారిస్లో జరిగింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది.జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి పాటను త్వరలో విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.


## ఆహా'లో 'బేబి' స్ట్రీమింగ్..



తిరుగులేని ఎంటర్టైన్మెంట్ అందిస్తూ దూసుకెళ్తోన్నఏకైక తెలుగు ఓటీటీ మాధ్యమం 'ఆహా'. ఇప్పటికే ఎన్నో బ్లాక్ బస్టర్ మూవీస్, షోస్, వెబ్ సిరీస్లను అందించిన ఆహా తాజాగా మరో బ్లాక్ బస్టర్ 'బేబి' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించటానికి రెడీ అయ్యింది. ఈ సినిమా ఆహాలో ఆగస్ట్ 25 నుంచి స్ట్రీమింగ్ అవుతుంది. ఇప్పటికే కల్ట్ క్లాసిక్గా తెలుగు ప్రేక్షకుల ప్రేమాభిమానాల పొందిన 'బేబి' చిత్రం త్వరలోనే ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్లో చేరటానికి పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో రూ.899లను చెల్లించిన తన గోల్డ్ ప్యాక్ సబ్ స్క్రైబర్స్కు మరో అపూర్వ అవకాశాన్ని అందించింది ఆహా. ఈ గోల్ ప్యాక్ సబ్ స్క్రైబర్స్ ఇప్పుడు ఏకంగా 12 గంటలు ముందుగానే బేబి సినిమాను చూడబోతున్నారు. ఈ గోల్డ్ ప్యాక్ సబ్ స్క్రైబర్స్ తీసుకున్న వారు సినిమాలను, వెబ్ సిరీస్లను చూసేటప్పుడు 4K డాల్బీ ఆడియోలో ఎలాంటి యాడ్స్ లేకుండా సినిమాను చూసే అమేజింగ్ ఎక్స్పీరియెన్స్ను పొందుతారు. ఈ సదుపాయం ఇటు తెలుగు, అటు తమిళ ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్లోని సబ్ స్క్రైబర్స్కు అందుబాటులో ఉంది. ఆహా సబ్ స్క్రిప్షన్లో చాలా మార్పులను చేసింది. దీని కారణంగా ఎస్వీఓడీ (సబ్ స్క్రిప్షన్ వీడియో ఆన్ డిమాండ్)లో చాలా గొప్పగా నెంబర్స్ నమోదు అయ్యాయి. ఆహా తెలుగు ఆడియెన్స్ కోసం సబ్ స్క్రిప్షన్ వివరాలు... రూ. 699లకు ఏడాది పాటు ఎలాంటి యాడ్స్ లేని ప్యాక్ లభ్యం. రూ. 399లకు ఏడాది పాటు యాడ్స్తో కూడిన ప్యాక్ లభ్యం. రూ. 199లకు మూడు నెలల పాటు యాడ్స్తోకూడిన ప్యాక్ లభ్యం. రూ.99 ల ప్యాకేజీ యాడ్స్కూడింది. ఇది కేవలం మొబైల్ యూజర్స్కు మాత్రమే. ఈ సందర్భంగా ఆహా వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ స్ట్రాటజీ, ఎస్వీఓడీ హెడ్ రాకేష్సీకే మాట్లాడుతూ ''ప్రేక్షకులకు అత్యంత నాణ్యతతో కూడిన నిరంతర వినోదాన్ని అందించాలనే నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం. వారికి మరింత స్థిరమైన వినోదాన్ని మరిన్ని ఫీచర్స్ కలిపి అందించాలనే ఉద్దేశంతో సబ్ స్క్రిప్షన్ ప్యాక్ ధరలలో కొన్ని మార్పులు చేయటం జరిగింది". సామజవరగమన, హిడింబ వంటి సినిమాలతో ఆహా తన యూజర్లను అలరిస్తూ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు లెటెస్ట్ సెన్సేషనల్ కల్ట్ బ్లాక్ బస్టర్ బేబి సినిమా ఆహాలో అందుబాటులోకి రానుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ నటించిన బేబి సినిమాను ఎస్ కే ఎన్ (శ్రీనివాస్ కుమార్ నాయుడు) నిర్మించగా.. సాయి రాజేష్ దర్శకత్వం వహించారు. ఆహా వేదిక మీద బేబి చిత్రం ప్రదర్శితం కానుంది. థియేటర్లో ఆల్రెడీ ఈ సినిమా బ్లాక్ బస్టర్గా నిలిచింది. ఇప్పుడు ఓటీటీ ఆడియెన్స్ను అలరించేందుకు రెడీగా ఉంది. ఆహా ఫ్లాట్ ఫాంపై బేబి సినిమా స్ట్రీమింగ్ కాబోతోంది. ఆహాలోని కంటెంట్ ప్రతీ ఏజ్ గ్రూప్ ఆడియెన్స్, క్లాస్ మాస్ ప్రేక్షకులన్న తేడా లేకుండా అందరినీ అలరిస్తూ ఉంటుంది.

## పవర్ ఫుల్ టైటిల్ ఓటు – ఫస్ట్

హృతిక్ శౌర్య హీరోగా ఫ్లిక్ నైన్ స్టూడియోస్ ప్రొడక్షన్ నెం 1గా రవి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'ఓటు' అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. 'చాలా విలువైనది' అనేది ట్యాగ్ లైన్. ఫస్ట్ లుక్ చాలా ఆసక్తికరంగా వుంది. పేపర్ కట్స్ బ్యాక్ డ్రాప్ లో హీరో హృతిక్ శౌర్య సీరియస్ గా ఆలోచిస్తూ ఇంటెన్స్ లుక్ లో కనిపించారు. ఈ చిత్రంతో హృతిక్ శౌర్య హీరోగా పరిచయం అవుతున్నారు. ఫస్ట్ లుక్ లో చాలా ప్రామెసింగ్ గా కనిపించారు. తన స్క్రీన్ ప్రెజెన్స్ డైనమిక్ గా వుంది. ఈ చిత్రంలో హీరోయిన్ గా తన్వినేగి నటిస్తున్నారు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తయింది. ఇప్పుడు ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేశారు. ఫస్ట్ లుక్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది.ఫ్లిక్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అగస్త్య సంగీతం అందిస్తున్నారు. ఎస్ రాజశేఖర్ డీవోపీ గా పని చేస్తున్న ఈ చిత్రానికి ప్రసాద్ ఎడిటర్. మోహన్ తాళ్లూరి ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఈ చిత్రానికి రామకృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యుసర్. తారాగణం: హృతిక్ శౌర్య, తన్వినేగి





## స్వయంభు రెగ్యులర్ షూటింగ్

'కార్తికేయ 2' చిత్రంతో దేశవ్యాప్తంగా ఫేం సంపాదించిన హీరో నిఖిల్ తన మైల్ స్టోన్ 20వ సినిమా కోసం దర్శకుడు భరత్ కృష్ణమాచారితో జతకట్టారు. 'స్వయంభు' టైటిల్ తో ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. స్వయంభు టైటిల్ క్యూరియాసిటీని పెంచగా, పవిత్రమైన సెంగోల్ను చూపించే టైటిల్ పోస్టర్ ప్రాజెక్ట్ గురించి మరింత తెలుసుకోవడానికి ఆసక్తి కలిగించింది. నిఖిల్ను ఫెరోషియస్ వారియర్ గా చూపించిన ఫస్ట్ లుక్ పోస్టర్కు అద్భుతమైన స్పందన వచ్చింది. శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా మేకర్స్ గ్రాండ్ లాంచింగ్ వేడుకను నిర్వహించారు. చిత్రబృందం, ప్రత్యేక అతిథుల సమక్షంలో ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. దిల్ రాజు కెమెరా స్విచాన్ చేయగా, అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. గీత రచయిత రామ జోగయ్య శాస్త్రి తొలి షాట్ కి దర్శకత్వం వహించారు. చదలవాడ శ్రీనివాసరావు స్క్రిప్ట్ ని మేకర్స్ కి అందజేశారు. ఈ కార్యక్రమానికి నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, సితార నాగవంశీ, దామోదర్ ప్రసాద్ హాజరయ్యారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ఈ రోజు నుంచి ప్రారంభం కానుంది. నిఖిల్ యోధుడిగా గుర్రపు స్వారీ చేస్తూ డ్రాగన్పై బాణం వేస్తున్నట్లు కనిపించిన స్టప్ఫైయింగ్ పోస్టర్ ద్వారా అనౌన్స్మెంట్ చేశారు. మునుపెన్నడూ చూడని పాత్రలో నిఖిల్ కనిపిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లాగే ఈ కొత్త పోస్టర్ నెక్స్ట్ లెవల్ లో వుంది.నటుడి కెరీర్లోనే అత్యంత భారీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తోంది. స్వయంభు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతుంది. రవి బస్రూర్ సంగీతం అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్ప గారి డైలాగ్స్ అందిస్తున్నారు.

## అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ 'కేబుల్ రెడ్డి'

'రైటర్ పద్మభూషణ్' తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న హీరో సుహాస్, అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ కోసం నూతన దర్శకుడు శ్రీధర్ రెడ్డి తో చేతులు కలిపారు. ఫ్యాన్ మేడ్ ఫిలిమ్స్ బ్యానర్ పై బాలు వల్లు, ఫణి ఆచార్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'కేబుల్ రెడ్డి' అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు. షాలిని కొండేపూడి ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు.ఈ చిత్రాన్ని ఈ రోజు పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా లాంచ్ చేశారు. శ్రీధర్ రెడ్డి (దర్శకుడు) కెమెరా స్విచాన్ చేయగా దర్శకుడు శైలేష్ కొలను క్లాప్ కొట్టి స్క్రిప్ట్ ని మేకర్స్ కి అందించారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ.. దర్శకుడు శ్రీధర్ మంచి స్నేహితుడు. తనకి ఇది తొలి చిత్రం. రెండు రోజుల్లో షూటింగ్ స్టార్ట్ అవుతుంది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ మూవీ ఇది. చాలా ఎక్సయిటింగా వుంది.'' అన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది నా మొదటి సినిమా. చాలా ఆసక్తికరమైన కథ రాసుకున్నాను. అంతే ఆసక్తికరంగా, యంగేజింగా షూట్ చేయడానికి సన్నాహాలు చేశాం. ఒక టౌన్ లో జరిగే కథ ఇది. క్లీన్ ఎంటర్ టైనర్ గా వుంటుంది''అన్నారు. షాలిని కొండేపూడి మాట్లాడుతూ.. చాలామంచి టీంతో ఈ సినిమా చేస్తున్నాం. చాలా ఎక్సయిటింగ్ గా వుంది. దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు. బాలు వల్లు మాట్లాడుతూ .. ఇది మా మొదటి సినిమా. చాలా మంచి టీంతో పని చేస్తున్నాం. బౌండెడ్ స్క్రిప్ట్ తో షూట్ కి వెళ్తున్నాం. మొదటి షెడ్యూల్ 20 రోజుల్లో పూర్తి చేస్తున్నాం''అన్నారు. ఈ చిత్రానికి మహి రెడ్డి పండుగల డీవోపీ గా పని చేస్తున్నారు. స్మరణ్ సాయి సంగీతం అందిస్తుండగా క్రాంతి ప్రియం ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. నటీనటులు : సుహాస్, షాలిని కొండేపూడి




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com